క్లుప్తంగా

భాషతో భిన్న సంస్కృతులు ఐక్యం



ఉర్దూ స్కూల్‌లో భాషోత్సవం నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

ఆకివీడు: భిన్న భాషలు, జాతులు కలిగిన మన దేశంలో అన్ని భాషలను నేర్చుకుంటే సంస్కృతి, జాతి ఐక్యత, మత సామరస్యం పెరుగుతుందని ప్రధానోపాధ్యాయులు, జిల్లా రిసోర్స్ పర్సన్ ఆర్‌వీ నారాయణ (విక్రమ్) చెప్పారు. స్థానిక ఉర్దూ స్కూల్‌లో భాషోత్సవం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృభాషలపై పటుత్వం, అంగ్లం, హిందీ, ఉర్దూ భాషల్లో ప్రావీణ్యం సంపాదించాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు ఉర్దూ చదవడం, రాయడం, సంభాషణ, కథలు చెప్పడం, యాక్షన్ రైమ్స్ ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు చాంబర్స్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని బీఆర్‌ఆర్ అండ్ జీకేఆర్ ఛాంబర్స్ కళాశాల ఆవరణలో శనివారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. డి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఇంటర్వ్యూలు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బీఎస్సీ, బీటెక్, ఎంఎస్సీ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ ఉత్తీర్ణులై, వయస్సు 21 నుంచి 25 ఏళ్ల వయస్సు లోపు పురుష అభ్యర్థులు మాత్రమే పేర్కొన్నారు. ట్రైనీ సూపర్‌వైజర్, గ్రాడ్యుయేట్ అప్రెంటీస్ ఉద్యోగాలకు నెలకు రూ.18వేల నుంచి రూ.24వేల వరకు జీతంతో పాటు ఉచిత వసతి, భోజనం, పీఎఫ్, ఈఎస్ఐ, ఇతర సౌకర్యాలు లభిస్తాయని వివరించారు. ఇతర వివరాలకు 99120 46234 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

దోమల నివారణకు ఫాగింగ్

పాలకొల్లు అర్బన్: పట్టణంలో దోమల బెడద ఎక్కువగా ఉండడంతో ఫాగింగ్ కార్యక్రమాన్ని మునిసిపల్ పారిశుధ్య సిబ్బంది చేపట్టారు. మునిసిపల్ కమిషనర్ బి.విజయసారధి ఆదేశాల మేరకు శానిటరీ సూపర్‌వైజర్ రాజు పర్యవేక్షణలో కల్వర్టులు, వంతెనలు, మురుగు కాలువల్లో దోమల నివారణకు చర్యలు తీసుకున్నారు. ప్రతి రోజూ 6 వార్డుల చొప్పున ఫ్యాగింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శానిటరీ సూపర్‌వైజర్ రాజు తెలిపారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి గంగరాజు

నరసాపురం: జాతీయ లోక్ అదాలత్‌ను మార్చి 8న నిర్వహిస్తామని, ఈ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని నరసాపురం సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు పోలీసు అధికారులకు సూచించారు. జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై కోర్టు హాలులో జడ్జి నరసాపురం, పాలకొల్లు, యలమంచిలి, మొగల్తూరు మండలాల పోలీసు అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదాలత్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. కక్షిదారులకు సమన్యాయం అందించడంలో పోలీసు అధికారుల సమన్వయంతో పనిచేయాలని సూచించారు. లోక్ అదాలత్ ప్రాముఖ్యతను కక్షిదారులకు వివరించాలని చెప్పారు. పారాలీగల్ వలంటీర్ల ద్వారా విస్తృత ప్రచారం చేయించాలని కోరారు. కార్యక్రమంలో నరసాపురం, పాలకొల్లు సీఐలు బి.యాదగిరి, బి.దుర్గప్రసాద్, జి.శ్రీనివాస్, ఏపీపీ ఎండీ హమీద్ తదితరులు పాల్గొన్నారు.

సోలార్ రూఫ్‌తో విద్యుత్ ఆదా



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏడీఈ సీహెచ్ రామకృష్ణ

పాలకొల్లు అర్బన్: ప్రతి ఇంటిపైనా సోలార్ రూఫ్ ఏర్పాటు చేసుకుని విద్యుత్‌ను ఆదా చేసుకోవాలని ఎలక్ట్రికల్ ఏడీఈ సీహెచ్ రామకృష్ణ కోరారు. మండలంలోని పూలపల్లి గ్రామ సచివాలయం వద్ద గురువారం సోలార్ రూఫ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఏడీఏ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సబ్సిడీతో పాటు బ్యాంక్ రుణ సౌకర్యం అందిస్తుందన్నారు. సోలార్ రూఫ్ ద్వారా ఆదా చేసిన విద్యుత్‌ను వినియోగదారుడు విద్యుత్ సంస్థకు విక్రయించుకునే వెసులుబాటు ఉందని వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పాలా శ్రీనివాసరావు, ఎలక్ట్రికల్ ఏఈ ఎల్.శ్రీనివాసరావు, ఎల్ఐ ఎస్.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడులపై కూటమి కన్నెర్ర



మోడల్ స్కూల్‌కు ఎంపికైన వెలుతురు రాని జూపూడి సుబ్బన్న ప్రాథమికోన్నత పాఠశాల



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసిన ఉండి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజు(ఫైల్)



జూపూడి సుబ్బన్న ఎంపీపీ స్కూల్‌లో విలీనం కానున్న అన్ని వసతులు కలిగిన ఎస్‌కేవీఆర్ ఎంపీపీ స్కూల్

- ప్రాథమిక మోడల్ స్కూల్ పేరుతో విలీనం
- నియోజకవర్గంలో 31 పాఠశాలల విలీనానికి శ్రీకారం
- ప్రభుత్వ పాఠశాలల మూసివేతకు కూటమి సర్కారు కసరత్తు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సర్కారు బడులకు మహర్దశ

ఆకివీడు: మోడల్ స్కూళ్ల పేరుతో సర్కారు బడులు దోబూచులాడుతున్నాయి. విద్యా సంవత్సరం ముగింపుకు సమీపంలో ఉన్నప్పటికీ ఆయా పాఠశాలల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు మోడల్ స్కూళ్ల ఏర్పాటు పట్ల ఆందోళనలో ఉన్నారు. జీఓ 117 ప్రకారం నియోజకవర్గంలోని 31 ప్రాథమిక, ఏకోపాధ్యాయ పాఠశాలను మోడల్ స్కూల్ పేరుతో సమీపంలోని పాఠశాలలో విలీనం చేసేందుకు కసరత్తులు చేస్తున్నారు. పేద, సంచార, ఇతర జాతుల పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలు గ్రామాల్లో అందుబాటులో ఉండాలి. కాని దూర ప్రాంతాలకు తరలించడంతో ప్రభుత్వ పాఠశాలల సంఖ్య మరింత తగ్గిపోయే ప్రమాదం ఏర్పడుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ప్రైవేట్ స్కూల్స్ పెరిగిపోయాయి. రానున్న రోజుల్లో ఆయా ప్రైవేట్ విద్యా సంస్థలు నో అడ్మిషన్ బోర్డులు పెట్టే అవకాశం కనిపిస్తుంది.

భారం... దూరం

సర్కారు బడుల్లో చదువు మరింత భారమైపోతుంది. పేద విద్యార్థులకు అందని ద్రాక్షగా మారిపోతుంది. మైళ్ల దూరం నడిచి వెళ్లి పాఠాలు చదువుకోవలసిన పరిస్థితి ఏర్పడనుంది. అందుబాటులో ఉన్న పాఠశాలలు మూతపడిపోయే అవకాశం ఏర్పడనుంది. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోనుంది.

అన్ని వసతులూ సమకూర్చినా

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో సర్కారు బడులు కార్పొరేట్ బడులను తలపించాయి. వసతులలో మేటిగా నిలిచాయి. విద్యార్థుల సంఖ్య పెరిగింది. కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో నో వెకెన్సీ బోర్డులు ఏర్పడ్డాయంటే విద్యార్థులు ఏ మేరకు పాఠశాలల్లో చేరారో స్పష్టమైంది. పేద విద్యార్థులకు అమ్మ ఒడి, విద్యా కానుక, దీవెన, పాఠశాలలను నాడు–నేడులో అభివృద్ధి పరచడం, విద్యార్థులకు అందుబాటులో మంచి బల్లలు, గ్రీన్ బోర్డు, ఎల్ఈడీ టీవీ, తాగడానికి ఆర్వో వాటర్, ప్రతి పాఠశాలలో ఫ్యాన్లు, కరెంట్ బల్బులు, ఆధునిక పద్ధతిలో మరుగు దొడ్లు, వంట శాల, కిచెన్ గార్డెన్, క్రీడా మైదానం, పరికరాలు వంటి సౌకర్యాలతో ఆయా పాఠశాలలు కళ కళలాడుతుండేవి.

విద్యార్థులకు ట్యాబ్‌లిచ్చి చదివించాం

పేద పిల్లలు చదువుకునే విధంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రోత్సహించింది. మీరు స్కూళ్లకు స్కూళ్లే లేపేసే నిర్ణయం తీసుకున్నారు. మేము ట్యాబ్‌లు ఇచ్చాం. స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీలు ఇచ్చి ఆధునిక విద్య అందుబాటులోకి తెచ్చాం. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచాం. అమ్మ ఒడి నిలుపుదల చేశారు. అమ్మకు వందనం అన్నారు వంద రూపాయలు కూడా ఇవ్వలేదు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లని పరిస్థితి ఏర్పడిందని వైఎస్సార్‌సీపీ ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహారావు అన్నారు.

నియోజకవర్గంలో పాఠశాలల వివరాలు:

మండలం	మోడల్ స్కూల్	బేసిక ప్రైమరీ స్కూళ్లు	ఫౌండేషన్ స్కూళ్లు	మెర్జ్ స్కూళ్లు
ఆకివీడు	15	16	7	5
కాళ్ల	14	10	2	4
ఉండి	7	28	18	10
పాలకోడేరు	14	8	2	12
మొత్తం	50	62	29	31

జాతీయ నెట్‌బాల్ పోటీలకు సీతా పాలిటెక్నికల్ విద్యార్థి



జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైన మిన్నును అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

భీమవరం: హర్యానాలో నిర్వహించనున్న 37వ జాతీయ స్థాయి జూనియర్ నెట్‌బాల్ పోటీలకు భీమవరం బి.సీతాపాలిటెక్నికల్ కళాశాల విద్యార్థి పి.మిన్ను రాష్ట్ర జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తున్నాడని కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రామకృష్ణ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ నుంచి రెండు రోజుల పాటు తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో నిర్వహించిన 10వ రాష్ట్ర స్థాయి జూనియర్ నెట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టులో పాల్గొన్న మిన్ను తృతీయ స్థానంలో నిలిచాడని ఈ నెల 26వ తేదిన హర్యానాలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు హాజరవుతున్నట్లు చెప్పారు. క్రీడాకారుడు మిన్నును ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ జీబీఎస్ కుమార్‌రాజు అభినందించారు.

పీడీఎఫ్‌తో నిరుద్యోగ సమస్యల పరిష్కారం



భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో వెంకటేశ్వరరావు

భీమవరం: ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికల్లో ఓటర్లు పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులను గెలిపిస్తే నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు కోరారు. గురువారం భీమవరంలోని విష్ణు విద్యా సంస్థలు, ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల, డీఎన్నార్ కళాశాలల్లో వీరరాఘవులను గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఉద్యోగుల, నిరుద్యోగుల సమస్యలపై గత 17 ఏళ్లుగా పీడీఎఫ్‌కు సంబంధించిన ఎమ్మెల్సీలు పోరాడుతున్నారన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాలని ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, స్కీం వర్కర్ల తరఫున భుత్వాలను నిలదీసినట్లు చెప్పారు. ఈ నెల 27న జరిగే పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో వీరరాఘవులను గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు భూపతిరాజు రవికుమార్‌రాజు, వేగేశ్న సూర్యనారాయణరాజు, అల్లూరి సుబ్బరాజు, బంగార్రాజు, యుటిఎఫ్ జిల్లా నాయకులు విజయరామరాజు, చెల్లబోయిన పట్టాభి రామయ్య, కుమార్ బాబ్జి, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్ఎస్ఎన్ రాజు, పాకలపాటి సీతారామరాజు, సిఐటియు నాయకులు గోపాలన్, వాసుదేవరావు, క్రాంతి, రాము తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ నాయకుల ప్రచారం

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ మేధావుల సంఘాలు బలపరిచిన దిడ్ల వీరరాఘవులను గెలిపించాలని గురువారం భీమవరంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు బి.వాసుదేవరావు మాట్లాడుతూ అధికార కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకిచ్చిన వాగ్దానాలు ఏమాత్రం నెరవేర్చడం లేదని విమర్శించారు. శాసనమండలిలో ఉద్యోగ ఉపాధ్యాయుల కోసం కేటాయించిన స్థానాలను కూడా కూటమి నాయకులు రాజకీయ లబ్ధి కోసం లాక్కోవాలని చూడడం దారుణమన్నారు. ప్రభుత్వం ఉపాధి కల్పించలేక, ధరలను నియంత్రించ లేకపోయిందని ఇటువంటి తరుణంలో ప్రధాన సమస్యలపై గళమెత్తే అభ్యర్థులను చట్ట సభలకు పంపించాలన్నారు. కార్యక్రమంలో ఎం.ఆంజనేయులు, కోదండం, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల శిక్షణ



అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న నిర్వాహకులు

ఆకివీడు: సమగ్ర సంక్షేమానికి మంచి అలవాట్లు నాంది అని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ముత్యాల వెంకట స్వామి, జిల్లా రిసోర్స్ పర్సన్ విక్రమ్, ఇస్మాయిల్ అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణా కార్యక్రమం మూడో రోజు గురువారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృత్యాధార బోధన ద్వారా విద్యార్థుల్లోనూ, ఉపాధ్యాయుల్లో సృజనాత్మక శక్తి పెరుగుతుందన్నారు. ఆలోచనా సామర్థ్యం పెరిగి నూతన ఆవిష్కరణలకు మార్గం ఏర్పడుతుందన్నారు. బోధనాభ్యాస సామగ్రితో గణిత నైపుణ్యాలు, పరిసరాల సహాయంతో నేర్చుకునే వాతావరణం, ప్రేరణ కల్పింస్తుందని చెప్పారు. పిల్లలు ఉత్సాహంగా ఆసక్తిగా బోధనను వింటారన్నారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్ రత్న కుమారి మాట్లాడుతూ టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ద్వారా విద్యార్థులు మేధా సంపత్తిని పొందుతారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎ.రవీంద్ర, పురుషోత్తం, ముకుందరావు, బి.రాంబాబు, డి.నాగభూషణ్‌రావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన విగ్రహాల ప్రతిష్ఠకు ఏర్పాట్లు పూర్తి



కలవపూడిలో వారంరోజులుగా హోమాలు నిర్వహిస్తున్న భక్తులు

కాళ్ల: మండలంలోని కలవపూడిలో కొలువైన ఉమా భీమేశ్వరస్వామి ఆలయంలో నూతన విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని నిర్వహకులు గురువారం తెలిపారు. గ్రామంలో దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ ఆలయం శిథిలావస్థకు చేరడంతో నూతన ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు పూనుకున్నామన్నారు. దీంట్లో భాగంగా రెండు వారాల నుంచి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పునర్నిర్మాణం చేసిన ఆలయంలో అత్యంత భక్తి శ్రద్ధలతో విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా గ్రాలమలంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్నట్లు నిర్వహకులు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా వేద పండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ప్రత్యేక హోమాలు చేపట్టినట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం పదిన్నర గంటలకు నూతన ఆలయంలో స్వామి, అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కుంభాభిషేకం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు, నిర్వహకులు తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వారు తెలిపారు.

సామూహిక ఎలుకల నివారణ చేపట్టాలి



పంట పొలంలో ఎలుకల బొరియలు మూస్తున్న కూలీలు

భీమవరం అర్బన్: పంట చేలల్లో ఎలుకలు వరి దుబ్బులను కొరికి చేనును నాశనం చేస్తాయని వాటిని సామూహికంగా మట్టుపెట్టాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలలలోని తుందుర్రులో గురువారం పంట చేలల్లో ఎలుకల బొరియలు మూసే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏవో నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయంలో ఎలుకలను నిర్మూలించకపోతే పంట దిగుబడిపై తీవ్ర చూపుతాయన్నారు. ఆయకట్టు రైతులు పంట చేలల్లో మొదటి రోజు ఎలుకల బొరియలు మూయడం వలన మరుసటి రోజు అవి బొరియలను తెరుస్తాయని వాటి వద్ద ఎలుకల మందు కలిపిన నూకల పొట్లాలను పెడితే వాటిని తిని మృతి చెందుతాయన్నారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, వ్యవసాయ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిని మనమే కాపాడుకోవాలి



క్లాత్ బ్యాగులను అందజేస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశంచౌక్): ప్రకృతి మనకు అందించిన స్వచ్ఛమైన గాలి నీరు మన ఆరోగ్యానికి మంచివని, ప్రకృతికి విరుద్ధంగా ప్లాస్టిక్ వినియోగం అనారోగ్యమేనని జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ అధికారి కె.అప్పారావు అన్నారు. విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయంలో క్లాత్ బ్యాగులను ఉచితంగా అందించారు. అప్పారావు మాట్లాడుతూ ప్లాస్టిక్ అనారోగ్యమని తెలిసి కూడా ప్రజలు వాడుతున్నారంటే అరోగ్యంపై నిర్లక్ష్య ధోరణి అని అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల శాఖాధికారి జీవీఆర్ గణపతిరావు మాట్లాడుతూ తెలిసి కూడా తప్పు చేయడం అవివేకమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ నాగరాణి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించి ఉచితంగా క్లాత్ బ్యాగులను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కె.సత్యనారాయణ, కె.నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు ఇవ్వాలి



లీడ్‌బ్యాంక్ మేనేజర్ ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు

భీమవరం: కౌలు రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులను తక్షణమే ఇచ్చి స్కేల్ అప్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు అందించాలని ఏపీ కౌలు రైతుల సంఘం డిమాండ్ చేసింది. గురువారం కలెక్టరేట్‌లోని లీడ్ బ్యాంక్ మేనేజర్ పి ప్రేమ్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దా రమేష్, ఉపాధ్యక్షుడు ఉండి వీరభద్రం మాట్లాడుతూ రూ.2 లక్షల వరకు వడ్డీ, హామీ లేని పంట రుణాలు మంజూరు చేయాలన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వైవీ ఆనంద్ మాట్లాడుతూ పంట సాగుదారు హక్కుల చట్టం 2010 పక్కాగా అమలు చేయాలని జిల్లా వ్యాప్తంగా కౌలు రైతులకు మార్గదర్శకాలు అనుసరించి న్యాయం చేయాలని కోరారు. రుణాల కోసం వెళ్లిన కౌలు రైతులను భూయజమాని షూరిటీ సంతకం పెట్టాలని, పంట రుణం తీసుకోకుండా ఉండాలని బ్యాంకర్లు ఆంక్షలు విధిస్తున్నారని లీడ్ బ్యాంక్ జోక్యం చేసుకోవాలన్నారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కలిశెట్టి వెంకట్రావు మాట్లాడుతూ కౌలు రైతులు ఆహార, వాణిజ్య పంటలు, కూరగాయలు పండిస్తున్నారని బ్యాంకు రుణాలు అందకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ



విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

భీమవరం: విద్యార్థినులు ఆత్మ రక్షణతో పాటు ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకోవాలని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు అన్నారు. గురువారం కళాశాలలోని ఉమెన్స్ హాస్టల్ విద్యార్థినులకు 40 రోజుల పాటు నిర్వహించిన సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణా కార్యక్రమం ముగింపు సందర్భంగా ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో–ఆర్డినేటర్ పి.భువనేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థినులు మాత్రమే కాకుండా విద్యార్థులు కూడా తమను తాము రక్షించుకునే విధంగా సంపూర్ణ ఆరోగ్యంతో మానసిక స్థైర్యం ఆత్మ విశ్వాసం పెంపొందించుకునేందుకు శిక్షణ దోహదం చేస్తుందన్నారు. ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ తమ కళాశాలలో అన్ని విభాగాల్లో విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు మానసిక ధైర్యం పెంపొందించేందుకు ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిక్షణ పొందిన విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందించారు. ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ హెడ్‌బీహెచ్‌వీఎస్ లక్ష్మి, పీడీ పి.సత్యనారాయణరాజు, అసిస్టెంట్ పీడీ జి.సారిక, హాస్టల్ డిప్యూటీ వార్డెన్ ఏపీఎస్ సూర్యవర్మ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం అర్బన్: మండలంలోని తాడేరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో హైటెన్షన్ విద్యుత్ ఫీడర్లపై వార్షిక మరమ్మతుల నిమిత్తం పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ట్రాన్స్‌కో ఏఈ ఎస్.వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. తాడేరు, యమునాపల్లి, కొత్రపాడు, బేతపూడి, కరుకువాడ, తాడేరు ఇండస్ట్రియల్ లైన్లకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ ముందంజ



పేదలకు అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఉండి: సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ ముందుంటుందని ఉండి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సత్తి బ్రహ్మారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఎన్నార్పీ అగ్రహారంలో కన్నెగంటి రూత్‌కళ నివాసం వద్ద లయన్స్ క్లబ్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి ఆర్థిక సాయంతో నిరుపేదలకు అన్నదానం చేశారు. అనంతరం బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ ఉండి లయన్స్ క్లబ్ ఎన్నో అవార్డులు తీసుకోవడంతో పాటుగా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. క్లబ్ అడ్మినిస్ట్రేటర్ రుద్రరాజు నరసరాజు, కార్యదర్శి ముదునూరి శివరామరాజు, ఉపాధ్యక్షుడు గాదిరాజు రంగరాజు, క్లబ్ డీసీ సభ్యురాలు కన్నెగంటి రూత్‌కళ మాట్లాడుతూ మంచి చేయడంలోనే మనసుకు ఎంతో సంతృప్తి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో వెంకన్నబాబు, అనంతలక్ష్మి, కాశీవిశేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ కెసిహెచ్ అప్పారావు

నరసాపురం రూరల్: కూలీలకు పని కల్పించడమే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉద్దేశమని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కెసిహెచ్ అప్పారావు అన్నారు. గురువారం నరసాపురం మండలం తూర్పుతాళ్లు పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ పథకాన్ని ఉపయోగించుకుని కూలీలు తమ జీవన ప్రమాణాన్ని మెరుగుపర్చుకోవాలన్నారు. ఈయన వెంట నరసాపురం ఎంపీడీఓ గాదిరాజు రామకృష్ణంరాజు, ఏపీఓ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మహిళ కడుపులో 10కిలోల కణితి తొలగింపు



తొలగించిన 10 కిలోల కణితి

పాలకొల్లు అర్బన్: ఓ మహిళ కడుపులో ఉన్న కణితిని గుర్తించి దానిని వైద్యులు తొలగించారు. పాలకొల్లు పట్టణంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో ఈ చికిత్స చేశారు. విజయవాడకు చెందిన 52 ఏళ్ల మహిళ తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతుండగా చికిత్స అనంతరం కణితి ఉన్నట్టు గుర్తించారు. ఆమెకు సుమారు రెండు గంటలపాటు శస్త్ర చికిత్స చేసిన వైద్యులు దానిని తొలగించారు. తొలగించిన కణితి బరువు సుమారు 10 కిలోలు ఉందని డాక్టర్ సురేష్‌బాబు తెలిపారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుడి అరెస్టు

పోడూరు: పాలకొల్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని లంకలకోడేరు గ్రామంలో ఎక్సైజ్ ఎస్సై జి.మహేష్, రఘు గురువారం దాడులు నిర్వహించారు. బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఎం.వీరబ్రహ్మంను అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 6 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.